క్లుప్తంగా

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు చాపిరేవుల విద్యార్థుల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు చాపిరేవుల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈనెల 6వ తేదీన కర్నూల్‌లోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన అండర్ -14, అండర్ -17 విభాగాల్లో సాంసోన్, చరణ్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామ వనరులను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి

నంద్యాల(అర్బన్): గ్రామాల్లోని ఆదాయ వనరులను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ప్రభాకర్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు ఓన్‌సోర్స్ రెవెన్యూపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంచాయతీకి ఆదాయం లభించే వనరులు ఉంటాయన్నారు. వాటి ద్వార గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుగుణశ్రీ తదితరులు ఉన్నారు.

పత్తిపంటలో నూతన విధానాలు పాటించాలి



రైతులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పత్తి పంట లాభసాటిగా మారాలంటే తెగుళ్లు, చీడ పీడల నివారణకు నూతన విధానాలు పాటించాల్సిన అవసరం ఉందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ విల్సన్ అన్నారు. దేశీయంగా పత్తి పంట రైతులు పలు సవాళ్లను ఎదుర్కొంటున్నారని చెప్పారు. పేదరిక నిర్మూలనలో విశిష్ట పాత్ర పోషిస్తున్న పత్తి పంట సాగు పూర్వవైభవానికి శాస్త్రవేత్తలు, రైతులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ప్రపంచ పత్తి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ దేశీయంగా అధిక సాంద్రత విధానాల్లో పత్తి పంట సాగును ప్రోత్సహించడం, యంత్రాల ద్వార పత్తి తీయగలిగే వంగడాలను అందుబాటులోకి తీసుకొని రావాల్సి ఉందన్నారు. అనంతరం పత్తి సాగు చేసిన రైతులను సత్కరించారు.

మంద కృష్ణ మాదిగ సభను విజయవంతం చేద్దాం



ఉయ్యాలవాడలో కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

ఉయ్యాలవాడ: ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలో జరిగే మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు ఓబులేస్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో ఎస్సీ కాలనీలో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మొట్టమొదటి సారిగా నంద్యాల జిల్లాకు వస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఎమ్మార్పీస్ అధ్యక్షుడు ఓబులేస్, తదితరులు పాల్గొన్నారు.

ఒకే పన్ను విధానం ఎంతో ప్రయోజనకరం



ర్యాలీ చేస్తున్న కళాశాల విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): ఒకే దేశం ఒకే పన్ను విధానం ఎంతో ప్రయోజనకరమని నంద్యాల జిల్లా ఇంటర్ విద్యాధికారి శంకర్‌నాయక్ పేర్కొన్నారు. ఈ అంశంపై మంగళవారం పట్టణంలో ప్రభుత్వ బాలికల కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు కలిసి ర్యాలీ నిర్వహించారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపు వలన స్వదేశీ వస్తువుల వాడకం పెరుగుతుందన్నారు. దీని వలన ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ట

శిరివెళ్ల: వనికినిదిన్నెలో మంగళవారం వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. సర్పంచు బాల శరభయ్య ఆధ్వర్యంలో వెంకటాపురానికి చెందిన వసంత కుమార్ శర్మ శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట చేశారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి ప్రతిష్టలో పాల్గొని పూజలు చేశారు.



కాకరవాడలో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వాల్మీకులు



వాల్మీకి చిత్రపటం వద్ద వాల్మీక సంఘం నాయకులు



ఎంవీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆధ్యాత్మిక గురువు వాల్మీకి



వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నంద్యాల: వాల్మీకి మహర్షి రచించిన రామాయణం మహాకావ్యం సమస్త మానవాళికి ఆదర్శమని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పోలీసు అధికారులు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావులు జన్మించిన పుణ్యభూమి భారతదేశం. ఈ తరం వారు వాల్మీకి మహర్షి లాంటి మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకొని స్ఫూర్తి పొందాలన్నారు. గొప్ప ఆధ్యాత్మిక గురువు వాల్మీకి అని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుందాం

నంద్యాల(అర్బన్): ఆదికవి వాల్మీకి మహర్షి మానవ జాతికి రామాయణాన్ని అందించారని ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి ఫరూక్ అన్నారు.వాల్మీకి జయంతిని పురస్కరించుకొని స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాల్మీకి రచించిన రచనలో ధర్మం, నైతికత, సత్యం,న్యాయం వంటి విలువలు సమాజనిర్మాణానికి పునాది వేశాయన్నారు. యువత వాల్మీకి మహర్షి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని లక్ష్యాలను సాధించాలన్నారు. మంత్రివెంట వాల్మీకి సంఘం నాయకులు గోవిందనాయుడు, కాశన్న, వెంకటేశ్వర్లు, గుర్రప్ప, లాలు తదితరులు పాల్గొన్నారు.

- రామాయణ మహాకావ్య రూపకర్త మహర్షి జయంతి వేడుకలను మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రాముడిని ప్రపంచ మానవాళికి పరిచయం చేసిన వాల్మీకి అందరికి ఆరాధ్య దైవమంటూ ఆర్టీసీ బస్టాండు వద్ద ఏర్పాటైన వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. యంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న ఆధ్వర్యంలో వాల్మీకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లాలుస్వామి, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, జయరాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పులికొండన్న మాట్లాడుతూ వాల్మీకుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో రాష్ట్ర ప్రభుతం నిర్వహిస్తున్న వాల్మీకి జయంతి వేడుకలను బహిష్కరిస్తున్నామన్నారు. అదేవిధంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నాయకులు మహేశ్వరరెడ్డి, వాసులు పాల్గొని మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఫరూక్

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

ఉయ్యాలవాడ : మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మండలంలోని కాకరవాడ గ్రామంలో మంగళవారం జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి మహర్షికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సీతారాముల కోసం వాల్మీకి రాసిన రామాయణాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం సంఘ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

- దొర్నిపాడు: స్థానిక అంకాలమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని వాల్మీకిబోయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గా ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలమద్దిలేటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకుల డిమాండ్లను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్టీల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జమ్ముల రామదాసు, కార్యదర్శి బాల ఉసేని, దొర్నిపాడు అధ్యక్షుడు పెద్ద ఉసేని, ఉపాధ్యక్షుడు బోయ కిట్టు, కార్యదర్శి శ్రీనివాసులు, మండల యూత్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, లోకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టి నిర్ణయాలు తీసుకోవాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీపీ అమర్‌నాథరెడ్డి

దొర్నిపాడు: గ్రామాభివృద్ధి కోసం సర్పంచ్‌లు, కార్యదర్శులు సమష్టి నిర్ణయాలు తీసుకోవాలని ఎంపీపీ గోపవరం అమర్‌నాథరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు గ్రామ పంచాయతీల్లో సొంత వనరులు ఎలా పెంపొందించుకోవాలనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలన్నారు. ఆదర్శవంతమైన విధులు నిర్వహించి పంచాయతీ ఆదాయ వనరులు పెరిగేలా ఉమ్మడి బాధ్యత వహించాలన్నారు. ముఖ్యంగా జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ : గ్రామాల్లో ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు అనేక మార్గాలు ఉన్నాయని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సొంత రెవెన్యూపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉంటే వాటిని పార్కులుగా మార్చడం, వ్యాపారులకు లీజ్‌కు ఇవ్వడం అలాగే గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో రూ. 30 లక్షలు వ్యయం చేసి నిర్మించిన సంత మార్కెట్ నిరుపయోగంగా మారిందన్నారు. వీటిని ఆసక్తి కలిగిన వారికి బాడుగకు ఇవ్వడం ద్వారా పంచాయతీలకు వనరులు పెరుగుతాయన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్న వాటిని వాడుకలోకి తీసుకు రావాలన్నారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగలక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీలు సొంత ఆదాయాలపై దృష్టి పెట్టాలి

శిరివెళ్ల: సొంత ఆదాయాలపై పంచాయతీలు దృష్టి పెట్టాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప అన్నారు. మంగళవారం రెండు రోజుల పాటు జరగనున్న సర్పంచుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపంలో గ్రాంట్లను విడుదల చేస్తున్నాయన్నారు. మేజర్ గ్రామ పంచాయతీలకు తాగు నీరు, ఇంటి పన్నుల ద్వారా ఆదాయాలు వస్తున్నాయన్నారు. కానీ చిన్న పంచాయతీలకు ఆ ఆదాయాలు లేవన్నారు. అందువలన ప్రతి గ్రామ పంచాయతీలు పన్ను, పన్నుయేతర వనరులపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ గ్రాంట్‌లపై ఆధార పడకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పన్ను, గ్రంథాలయం, కాటా రుసుం, ప్రకటనలపై పన్నులు, వినియోగ చార్జీలు, డ్రైనేజీ, లైటింగ్, నీటి పన్నులను తప్పక వసూళ్లు చేయాలన్నారు. అలాగే వ్యవసాయ భూములపై, ఖాళీ స్థలాలు, వాహనాలపై పన్నులు వసూళ్లు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పని గంటల పెంపు బిల్లును ఉపసంహరించాలి




గాంధీచౌక్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): పరిశ్రమల్లో 8 గంటల పనివిధానాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించడం సరి కాదని రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్నారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో గాంధీ చౌక్ సెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికుల చట్టాలు రద్దుచేసి 4 లేబరు కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఇందులో పనిగంటలు పెంచి కార్మికులు శ్రమను యాజమాన్యాలు దోచుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఎక్కువ సెలవులు పొందే విధంగా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పటం కార్మికులను మోసగించటానికేనన్నారు. చంద్రబాబు సర్కారు కనీసం కార్మిక సంఘాలతో చర్చించకుండా నేరుగా అసెంబ్లీలో పనిగంటల పెంపు బిల్లు ప్రవేశపెట్టడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహ నాయక్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ కార్యదర్శి కె. మహమ్మద్ గౌస్, నాయకులు సుబ్బారావు, జైలాన్‌లు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో శ్రీ షిరిడీ సాయిబాబా విగ్రహం

నంద్యాల వ్యవసాయం: పట్టణ శివారులోని బొమ్మల సత్రం శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శ్రీసాయిబాబా సేవకుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీ సాయిబాబా మూల విరాట్‌కు మేలుకొలుపు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం మధ్యాహ్న హారతి ఇచ్చి భక్తులకు అన్నదాన వితరణ చేశారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మల్లికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అధ్యక్షుడు అశోక్ రెడ్డి, మధుమోహన్ రెడ్డి, శివ నాగేందర్ రెడ్డి కమిటీ సభ్యులు, సాయి సేవకులు, సాయి భక్తులు, పాల్గొన్నారు..

10న మండలస్థాయి ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 10న నంద్యాల పట్టణంలోని కేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ చంద్రావతమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్,యోగ, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ వంటి క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వపాఠశాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 95812 23990 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేత్ర పర్వం.. జ్యోతుల మహోత్సవం

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున నిర్వహించిన చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. అశేష జనసమూహం మధ్య అమ్మవారి ఉత్సవ విగ్రహం భక్తులకు దర్శనమిచ్చింది. తిరునాల సందర్భంగా తొగట వీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి జ్యోతుల ఉత్సవం కనుల పండువగా సాగింది. ఏటా శరన్నవరాత్రుల నుంచి పదిహేను రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు చివరి రోజున చౌడేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. పూర్వాచారం మేరకు బలిసమర్పణ చేసి ఉత్సవమాతను పల్లకీలో ఆశీనులను గావించి, పురవీధుల్లో ఊరేగించారు. భాజా భజంత్రీలు, డప్పు కళాకారుల నృత్య ప్రదర్శనల మధ్య భక్తులు సమర్పించిన జ్యోతులను తలపై పెట్టుకుని దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. భక్తుల నందికోల సేవ, ఖడ్గశావ, చెక్కభజన కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకొచ్చి దేవస్థానంలో కొలువుంచారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నవ నిర్మాణ సమితికి స్వచ్ఛాంధ్ర అవార్డు

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల నవ నిర్మాణ సమితికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అవార్డు ప్రకటించింది. మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి నుంచి స్వర్గధామం అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు ఆ అవార్డును అందుకున్నారు. పట్టణశివారులోని పీవీనగర్ సమీపంలో 7 ఎకరాల స్థలంలో మున్సిపాలిటీ హిందూ శ్మశాన వాటిక 'స్వర్గధామన్ని' ఒక పరిశుభ్ర, ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు కార్యక్రమంలో నెరవాటి సత్యనారాయణ, గెలివి రామకృష్ణ, బాబురావు, రాంప్రసాద్, హరి, తిమ్మారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

10 నుంచి బోధనేతర యాప్‌ల బహిష్కరణ

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 10వతేదీ నుంచి ఉపాధ్యాయులకు సంబంధించిన బోధనేతర యాప్‌లను బహిష్కరిస్తున్నట్లు ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవస్వామి,నగరి శ్రీనివాసులు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉపాధ్యాయుల,విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన యాప్‌లు తప్ప మిగిలిన అన్నింటిని ఉపాధ్యాయులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.ఉపాధ్యాయుల డీఎలు 12వ పీఆర్సీ,30శాతం మధ్యంతర భృతి,ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని లేనిపక్షంలో ఫ్యాక్టో జేఏసీ భాగస్వామ్య పక్షాల ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి సిద్ధమని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విజయవాడలో జరిగిన ఫ్యాప్టో రాష్ట్రస్థాయి పోరుబాట కార్యక్రమం విజయవంతం కావడంతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగిందన్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల (వ్యవసాయం): భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నం ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, ముక్కర కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేసిన న్యాయవాదిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, ఓబుళరెడ్డి చిన్న, లింగమయ్య, అంబేడ్కర్, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల ఖండన

భారత సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి న్యాయ వ్యవస్థపై దాడిగా పరిగణించాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు అన్నారు. అధ్యక్షుడు అబ్దుల్ సమద్, ఎజాజ్ హుస్సేన్ మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి పై దాడిని ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు బాబా ఫక్రుద్దీన్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలకు చెక్‌పెట్టేందుకే ఈకేవైసీ



కొబ్బెరి చెట్లను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

దొర్నిపాడు: ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకే శ్రామికులకు ఈకేవైసీ చేస్తున్నట్లు డ్వామా పీడీ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన మండలంలో జరుగుతున్న శ్రామికుల ఈకేవైసీ, కొబ్బెరి చెట్ల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఒకరి పేరుతో ఉంటే.. మరొకరు హాజరై వేతనం పొందుతున్నారన్నారు. ఆధార్, ఈకేవైసీ అనుసంధానం ద్వారా ఒకరి తరుపున మరొకరు హాజరు అయితే యాప్ అనుమతించదన్నారు. ప్రస్తుతం మండలంలో 9,900 జాబ్‌కార్డులు ఉండగా 50 శాతం ఈకేవైసీ పూర్తయినట్లు చెప్పారు. వెంటనే 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మండలంలో సాగుచేసిన కొబ్బెరి చెట్లను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీడీ సాంబశివరావు, ఏపీఓ హనీఫా, టీఏ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణులకు హాని తలపెట్టొద్దు



ఎల్లావత్తులలో ర్యాలీ నిర్వహిస్తున్న చెలిమ రేంజ్ అధికారులు

రుద్రవరం: అడవులు, అటవీ ప్రాంతాల్లో నివసించే వన్య ప్రాణులకు ఎలాంటి హాని తలపెట్ట వద్దని చెలిమ రేంజ్ పెద్ద కంబలూరు సెక్షన్ అధికారి కిషోర్‌కుమార్ ప్రజలను కోరారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన రుద్రవరం, శిరివెళ్ల మండలాల్లోని ఎల్లావత్తుల, మహదేవపురం గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల పాఠశాలల విద్యార్థులకు వన్య ప్రాణులు, అడవులు వాటి ప్రాముఖ్యత తదితర అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం రేంజ్ సిబ్బంది విద్యార్థులతో ఆయా గ్రామాల్లో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సెక్షన్ అధికారి మాట్లాడుతూ వన్య ప్రాణులను వేటాడటం, అటవీ ప్రాంతంలోని వృక్షాలను కూల్చడం నేరమన్నారు. అలా నేరాలకు పాల్పడితే పడే శిక్షల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పొలాల్లో సాగు చేసిన పంటల సంరక్షణకు కొందరు రైతులు వలలు, ఉచ్చులు వంటివి ఏర్పాటు చేసి వన్య ప్రాణులకు హానీ తలపెడుతున్నారని చెప్పారు. మానవ మనుగడకు వన్యప్రాణుల అవసరం ఎంతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు రామారావు, నాగప్ప తదితరులు ఉన్నారు.

ఆ న్యాయవాదిని దేశ బహిష్కరణ చేయాలి



సంజీవనగర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్) భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయిపై సనాతనం పేరుతో బూటు విసిరిన మతోన్మాద న్యాయవాది రాకేష్ కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి దేశ బహిష్కరణ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సంజీవనగర్ గేటు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు పి. మురళీధర్ మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసరడం రాజ్యాంగ సంస్థలను అవమాన పరచడమేనన్నారు. బీజేపీ పాలనలో మతోన్మాదులు పెట్రేగిపోతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సోమన్న, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. నాగరాముడు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి. డి.శ్రీనివాసులు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు జి హరినాథ్, నాయకులు ధనుంజయుడు జిలానీ భాష ,ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నంద్యాల పట్టణ కార్యదర్శి ఎస్.సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.